

చరిత్రకు చెదలు
చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడికోటలు శిథిలమవుతున్నాయి. వీటి మరమ్మతు విషయమై ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించు కోకపోవడం లేదు. వివరాలు 8లో ▸



చలికాలం.. జీవాలు పైలం
మానవ మనుగడకు ప్రకృతి సంపదతోపాటు పశుసంపద కూడా చాలా ముఖ్యం. వివరాలు 8లో ▸



గ్రూపు విభేదాలే కారణమా?
రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడిచి అధికారంలోకి వస్తే.. దుబ్బాక నియోజక వర్గంలో మాత్రం పార్టీ ఘోరపరాజయం చవిచూసింది. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఓ వరమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వాల్‌పోస్టర్‌ను నేతలతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా పేదలకు రూ.10 లక్షల వైద్య సహాయం అందిస్తున్నామన్నారు. గతంలో ఐదు లక్షల వరకే ఆరోగ్య బీమా ఉండగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పది లక్షలకు పెంచిందన్నారు. 1,672 రకాల వ్యాధులకు వైద్యం అందించే దిశగా సర్కారు చర్యలు తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యువరాజ్, రతన్ సింగ్, రాజు, సాయిన్న పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన విద్యుత్ శాఖ డైరెక్టర్



మంత్రి దామోదరను కలిసిన రాములు

సంగారెడ్డి : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆదివారం విద్యుత్ పంపిణీ సంస్థ కమర్షియల్ విభాగ డైరెక్టర్ కె. రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం బహూకరించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీకి చెందిన 327 యూనియన్ జిల్లా కార్యదర్శి భూపాల్ రెడ్డి ఉన్నారు.

హర్షణీయం



బస్సులో ప్రయాణిస్తున్న ఆర్‌ఎం ప్రభులత, నిర్మలారెడ్డి

సంగారెడ్డి: ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమని ఆర్టీసీ ఆర్‌ఎం ప్రభులత అన్నారు. ఆదివారం కొత్త బస్టాండ్ ఆవరణలో ఉచిత బస్సు సౌకర్యాన్ని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జయప్రకాశ్ రెడ్డి కలిసి ఆమె ప్రారంభించారు. డిప్యూటీ ఆర్‌ఎం జోస్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్: 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను ఆదివారం రాశారు. జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 882 మంది పరీక్షను రాశారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఐదేళ్ల సంవత్సరాల పాటు ఏడాదికి 12,000 స్కాలర్‌షిప్ అందనుందని వెల్లడించారు.

దేదీప్యం.. వర్గల్ క్షేత్రం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వర్గల్(గజ్వేల్): దివ్వెల వరుసలతో వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం కాంతులీనింది. కార్తీక దీపాలతో శంభునికొండ శోభిల్లింది. భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాత్రి భక్తజన సామూహిక లక్షదీపోత్సవం నేత్రపర్వం చేసింది. గురు మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో కార్తీక దీపోత్సవం మొదలైంది. ఈ మహోత్సవంలో వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించి పునీతులయ్యారు. జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం దీపోత్సవ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. జల ప్రోక్షణ చేశారు.

అక్రమార్జనకు అడ్డదారులు

- డ్రగ్స్ వ్యాపారం సాగిస్తున్న పలువురు అక్రమార్కులు
- కొడకంచిలో రూ.3 కోట్ల సరుకు పట్టుకోవడమే నిదర్శనం



తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న యాంటీ నార్కోటిక్ అధికారులు, పోలీసులు (ఫైల్)

సమాజంలో ఉన్న రోగాలకు వారు మందు వేస్తారు. కానీ వారిలో కొందరు తమకు పట్టిన డబ్బు రోగాన్ని నయం చేసుకోలేకపోతున్నారు. డ్రగ్స్ విక్రయించి అక్రమంగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వీరు తయారు చేసిన డ్రగ్స్ వాడి యువత మత్తుకు బానిసై పెడదారిని అనుసరిస్తున్నది. అటవీ ప్రాంతాలు, ఫాంహౌస్‌ల అడ్డాగా వాటిని తయారు చేస్తున్నారు. ఇటీవల భారీ స్థాయిలో మత్తుపదార్థాలను అధికారులు పట్టుకోవడం అందుకు నిదర్శమని చెప్పవచ్చు.



డ్రగ్స్ తయారు చేసిన ఫాంహౌస్ ఇదే (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, పాశమైలారం తదితర పారిశ్రామిక వాడలు ఉన్నాయి. ఇందులో లక్షల సంఖ్యలో దేశంలోని అన్ని రాష్ట్రాల వ్యక్తులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో 30 వేల వరకు కెమిస్టులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డ్రగ్స్ తయారీ విషయంలో వారిదే కీలక పాత్ర. వీరికి డ్రగ్స్ తయారీపై పూర్తి పట్టు ఉంటుంది. దీంతో డబ్బులు ఎక్కువగా సంపాదించాలనే కొందరు అక్రమార్కులు డ్రగ్స్‌ను తయారు చేస్తున్నారు. ఇటీవల కొడకంచిలోని అటవీ ప్రాంతంలో డ్రగ్స్ తయారీ ముఠాను యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. ఈ దాడుల్లో కెమిస్ట్ అయినటువంటి మాణిక్యాల రావుదే కీలక పాత్ర. సుమారు రూ.3కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం అందుకు తార్కాణంగా చెప్పొచ్చు.

గప్‌చుప్‌గా..

డ్రగ్స్‌ను తయారు చేసేందుకు ఎవరికీ అనుమానం రాకుండా ఉండే స్థలాలను ఎంచుకుంటున్నారు. అటవీ ప్రాంతాలతో పాటు పలు రకాల ఫాంహౌస్‌ల్లో తయారు చేస్తున్నారనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడల్లో మూతపడ్డ పరిశ్రమలను సైతం అక్రమార్కులు తయారీకి ఎంచుకుంటున్నారు. గ్రామాలకు శివారులోని ఫాంహౌస్‌లపై తగిన నిఘాను ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. డ్రగ్స్‌ను తయారు చేసేందుకు నిర్వాహకులు ఏకంగా చిన్నపాటి పరిశ్రమనే స్థాపిస్తున్నారు. సుమారు రూ.25లక్షల వరకు వెచ్చించి అవి తయారు చేసేందుకు సదుపాయాలను సమకూర్చుకుంటున్నారు. కొడకంచి శివారులో డ్రగ్స్ తయారీ కేంద్రంలో రియాక్టర్‌తో పాటు డ్రయ్యర్, ఏసీ ఇతర విలువైన వస్తువులను వినియోగించడం తార్కాణం.

నిఘా పెట్టాం: రూపేశ్ జిల్లా ఎస్పీ



డ్రగ్స్ దందా నిర్వహిస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. పారిశ్రామిక వాడల్లో మూతపడ్డ పరిశ్రమలపైనా నిఘా పెట్టాం. తమకు ప్రజలు కూడా నిర్భయంగా సమాచారాన్ని ఇవ్వాలి. అప్పుడే పూర్తి నివారణ సాధ్యం కానుంది.

యువత పెడదారి..

డ్రగ్స్‌కు యువత బానిసలవుతున్నారు. హైదరాబాద్‌కు సమీపంలోనే పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం ఉంది. ఇక్కడ తయారు చేసిన డ్రగ్స్‌ను సులువుగా పబ్‌లు, పలు రకాల ఉన్నత హోటల్స్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల యువత కూడా వీటికి అలవాటు పడుతున్నారని తెలుస్తోంది. నివారణ చేసేందుకు గాను అధికారులు గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా వైకుంఠపురం తృతీయ వార్షికోత్సవాలు



ఆలయంలో చిన్నజీయర్ స్వామి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి శివారులోని వైకుంఠపురం తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చిన్నజీయర్ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వివిధ రాష్ట్రాల వైష్ణవ ఆలయాల పండితులకు, భక్తులకు మంగళ శాసనాలు అందజేశారు. జై శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేతకీలో పూజలు



దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కార్తీక మాసం సందర్భంగా కేతకీ సంగమేశ్వర ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో ఉన్న అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు.



మహిళలతో కలిసి విజయ చిహ్నం చూపుతున్న రాజనర్సింహ

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట (అందోల్) : ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట ఆర్టీసీ బస్ స్టాండ్ ఆవరణలో ఆదివారం మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను కలెక్టర్ శరత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలందరికీ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు విస్తరింపజేసిందన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అన్ని ఆసుపత్రుల్లో వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వట్‌పల్లి మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తామని ప్రకటించారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించడానికి మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు రోజులకే రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సంగారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, రిజినల్ మేనేజర్ ప్రభులత, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, మెప్మా పీడీ గీత, రాష్ట్ర యువ నాయకురాలు త్రిష, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకుల మాణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లయ్య, అందోల్, వట్‌పల్లి జెడ్పీటీసీలు రమేశ్, పత్రి అపర్ణ, వైస్ చైర్‌పర్సన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, సురేందర్‌గౌడ్, రేఖ ప్రవీణ్, రంగ సురేశ్, దాకూరి శివశంకర్, హరికృష్ణ, నాగరాజు, చందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకటేశం, రమేశ్‌గౌడ్, బాలయ్య, నాయకులు సంగమేశ్వర్‌గౌడ్, దాకూరి శ్రీనివాస్, ప్రదీప్ గౌడ్, రవి పాల్గొన్నారు.

అద్దె మైదానాల్లో ఆటలు

ఈ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు లేవు. దీంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. వీటిని ఏర్పాటు చేస్తామని నాయకులు ప్రతి సారీ హామీలు ఇవ్వడమే గానీ ఆచరణలోకి వచ్చేసరికి విస్మరించడం సాధారణమైంది. అనేక మంది క్రీడాకారులు దూర ప్రాంతాలకు వెళ్లి ఆడుకుంటున్నారు. కొందరైతే మైదానాలను అద్దెకు తీసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదీ రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పరిస్థితి.



పాఠశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని యువత సుమారు 20 ఏళ్లుగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని నేతలను కోరుతున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెల్లాపూర్ పరిధిలో క్రీడా మైదానం కోసం ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి స్థలాన్ని సైతం పరిశీలించారు. ఈ సమయంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రభుత్వం సైతం మారింది. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనగా మారింది. క్రీడా మైదానం కోసం చూసిన ప్రాంతాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఫంక్షన్ హాల్, మున్సిపల్ కార్యాలయానికి కేటాయించింది. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. కానీ క్రీడా మైదానం మాత్రం రాకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. సెలవు దినాల్లో యువకులు భెల్ కాలనీలోని పాఠశాల క్రీడా మైదానాలలో ఆటలు ఆడుకుంటున్నారు. అలాగే గ్రామ ప్రాంతాల్లో చెట్లల్లో, పుట్టల్లో సైతం ఆడుతున్నారు. గతంలో భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీను ఆనుకొని బీహెచ్‌ఈఎల్ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలంలో యువత వాకింగ్, క్రీడలు ఆడుకునేవారు. యాజమాన్యం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి అందులోకి ఎవరినీ రానివ్వకుండా చుట్టూ ఫెన్సింగ్ వేసింది. చేసేది లేక క్రీడాకారులు ఇతర ప్రాంతంలోని క్రీడా మైదానాలను అద్దెకు తీసుకొని ఆడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని స్థానికులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.

క్రీడామైదానికి స్థలం కేటాయించాలి



సరైన క్రీడా మైదానాలు లేక ఆటగాళ్లు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆట స్థలాన్ని కేటాయించాలి. దానిని అభివృద్ధి చేయాలి.

– సురేశ్, తెల్లాపూర్

దూర ప్రాంతాలకు వెళ్తున్నాం



స్థానికంగా క్రీడా మైదానాలు లేవు. భారతీనగర్ శివారు ప్రాంతంలోని క్రీడా మైదానాలను అద్దెకు తీసుకున్నాం. ఇక్కడే ఆటలాడుకోవాల్సిన పరిస్థితి. రామచంద్రాపురం పరిధిలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తే అందరికీ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– అంజాద్, భారతీనగర్ డివిజన్

మెరుగైన వైద్య సేవలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో మెరుగైన వైద్యసేవల కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథక పోస్టర్లు ఆవిష్కరించారు. రాజీవ్‌చౌక్‌లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం నిధులన్నీ కాళేశ్వరానికి మళ్లించి అన్ని శాఖలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందించిందని గుర్తు చేశారు. ప్రమాద బాధితులకు 108, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీకి 104 సేవలు అమలు చేయగా బీఆర్‌ఎస్ హయాంలో వీటిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఖేడ్‌లో 100 పడకల ఆస్పత్రి విస్తరించగా గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు.

మాజీ ఎంపీకి సత్కారం

తన గెలుపునకు కృషి చేసిన జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి షెట్కార్, జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్‌కు సత్కరించారు.

సంక్షేమాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు



ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 నుంచి రూ.10లక్షలకు పెంచారన్నారు. పేదలకు ఇది వరం లాంటిదన్నారు. ఈ పథకాలను అమలు చేయడం సంతోషకరమన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ స్రవంతి రెడ్డి, ఏరియా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల నిరసన

మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఎంపీ బీబీ పాటిల్ ఫొటోలు లేక పోవడంతో కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ప్రోటో కాల్ పాటించడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు వెంటనే స్పందించి బ్యానర్‌పై ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలను అతికించడంతో వివాదం సద్దుమణిగింది.



ఉచిత టికెట్‌ను చూపుతున్న మహిపాల్ రెడ్డి

ఆటో రంగాన్నీ పట్టించుకోండి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రజలకు మంచి చేసే పథకాలను, కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మూలంగా ఆటో రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని, ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని కోరారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆదివారం పట్టణంలో లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అధికారి కార్యక్రమాల సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు ఇవ్వడంలో జాప్యం ఉండకూడదని సూచించారు.

కొమురవెల్లి మల్లన్నా.. మమ్మేలు

కొమురవెల్లికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కార్తీక మాసం చివరి వారం కావడంతో మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలోని గంగిరేణు చెట్టు వద్ద ముడుపులు కట్టి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కొండపైన రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఏఈవో అంజయ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

– కొమురవెల్లి(సిద్దిపేట):



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

క్లుప్తంగా

సర్వసభ్య సమావేశానికి హాజరవుతా

పొన్నంను కలిసిన మున్సిపల్ కమిషనర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజశేఖర్

హుస్నాబాద్: హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం రాత్రి మున్సిపల్ కమిషనర్ ఎం.ఆర్ రాజశేఖర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. త్వరలోనే జరిగే మున్సిపల్ పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి హాజరవుతానని మంత్రి చెప్పినట్లు కమిషనర్ వెల్లడించారు.

దామోదరకు సన్మానం



దామోదరను సన్మానిస్తున్న పాండు

మునిపల్లి(అందోల్): వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్కల పాండు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి సన్మానించారు.

వన భోజనాలతో ఐక్యత

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కార్యక్రమంలో చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: వన భోజనాలతో ప్రజల్లో ఐక్యత, స్నేహభావం పెరుగుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం మంజీరా డ్యామ్ శివాలయ ఆవరణంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతా ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఏకగ్రీవ తీర్మానం చేస్తూ నాకు మద్దతు ఇచ్చిన వీరశైవ లింగాయత్‌ల అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ పటేల్, శివ కుమార్, రాజు, ధనుంజయ్, రాజేశ్వర్ స్వామి, సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, చక్రపాణి, వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

నిజాంపేట(మెదక్): నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి ఆదివారం చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శ్యామ వ్వ, బుచ్చయ్యల కుమారుడు కుమ్మరి రాజు (30) మతిస్థిమితం సరిగా లేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలే దు. చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఘడీం చెరువులో మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమా చారం అందించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ అన్ని రకాల లిటిగేషన్ ల్యాండ్స్ డీల్ చేస్తాము. నమ్మకమైన సర్వీసెస్ చేయబడును. సంప్రదించండి: 7671886273. [HA-12567]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర।। 9177736926. [M-1221933]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [H-793661]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చలికాలం.. జీవాలు పైలం

- జాగ్రత్తలు తీసుకోకపోతే తీరని నష్టం
- పోషకులు సూచనలు తప్పకుండా పాటించాలి
- పశువైద్యాధికారి డాక్టర్ మంజుల

మానవ మనుగడకు ప్రకృతి సంపదతోపాటు పశుసంపద కూడా చాలా ముఖ్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా మేలు చేస్తున్నది. కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై మనుషులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో పశువులకు కూడా అలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. చలికాలంలో పశువుల వ్యాధుల బారిన పడకుండా పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)



పచ్చిక మేస్తున్న జీవాలు

రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ, జలుబు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని చిన్నకోడూరు పశువైద్యురాలు డాక్టర్ మంజుల తెలిపారు. చలికాలంలో జీవాలు నిమ్ము, జలుబు, దగ్గు వ్యాధులు వస్తే ఎలాంటి నియమ నిబంధనలు పాటించాలో ఆమె మాటల్లోనే..

దొమ్మ రోగం..

- దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం. కంటేజీఎస్ కాప్రైన్ ప్లూరో నిమోనియా అనే వైరస్ కారణంగా మేకలకు మాత్రమే తరుచుగా వచ్చే వ్యాధి. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది.
- వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడం రోజు రోజుకూ నీరసించి పోతాయి.



డాక్టర్ మంజుల, పశువైద్యాధికారి

- కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపు భాగం వంగి ఉండటం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతాయి.
- త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పట్టే ప్రమాదముంది. అయితే ఈ లక్షణాలు కనిపిస్తే దొమ్మ రోగంగా నిర్ధారణకు రాకూడదు.
- ఈ లక్షణాలు అమ్మతల్లి, పీపీ ఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడూ టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని అందించాలి.

జలుబు, దగ్గు..

- ఈ వ్యాధి సోకినప్పుడు పశువులకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్ము వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి.
- అలాగే క్రిముల ద్వారా సోకే అంటు వ్యాధులతోపాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాసకోశంలోకి వచ్చే కణాలు, నూనె పదార్థం శ్వాసకోశాన్ని చికాకు పెట్టే ఇతర పదార్థాలు కూడా జలుబు, దగ్గుకు కారణమవుతాయి.
- దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలి. వాతావరణం సరిగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి. జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- ఒక వేళ జీవి చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందలోని మిగిలిన జీవులకు చికిత్స చేయించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా దొమ్మ టీకా వేయించాలి.

గ్రూపు విభేదాలే కారణమా?

- దుబ్బాకలో కాంగ్రెస్ ఓటమిపై అధిష్టానం ఆరా..
- గెలుస్తుందనుకున్న దగ్గర ఎందుకు ఓడింది
- డిపాజిట్ కూడా దక్కకపోవడం ఆశ్చర్యం
- 25,235 ఓట్లతో 3వ స్థానానికి పరిమితం





చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగి అధికారంలోకి వస్తే.. దుబ్బాక నియోజక వర్గంలో మాత్రం పార్టీ ఘోరప రాజయం చవిచూసింది. మొదటి నుంచి గ్రూపు విభేదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న దుబ్బాకలో ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని భావించిన అధిష్టానానికి నిరాశే మిగిలింది. గెలుపు కాదు కదా కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ఓటమికి నేతల మధ్య నెలకొన్న గ్రూపు విభేదాలే కారణమా ఇంకా ఏమైనా ఉన్నాయా అన్న దానిపై పార్టీ అధిష్టానం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం.

టికెట్ దక్కకపోవడంతో..

మొదటి నుంచి దుబ్బాక కాంగ్రెస్‌లో గ్రూపు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో గ్రూపు విభేదాలు నెలకొనడంతో ఎన్నిసార్లు అధిష్టానం సమన్వయం కోసం ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఎన్నికల ముందు దుబ్బాక టికెట్ కోసం మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి, కత్తి కార్తీక తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. ఆఖరికి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ దక్కింది. దీంతో కత్తి కార్తీక ఎన్నికలకు నాలుగురోజుల ముందు బీఆర్ఎస్ చేరి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఇక టికెట్ రాకపోవడంతో శ్రావణ్ కుమార్‌రెడ్డి దుబ్బాక వైపే చూడకపోవడం తన అనుచరులు సైతం శ్రీనివాస్‌రెడ్డికి ఎన్నికల్లో సహకరించకపోవడం కనిపించింది.

డిపాజిట్ దక్కని పరిస్థితి..

దుబ్బాకలో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురతుందని అధిష్టానం ధీమాగా ఉండగా నియోజకవర్గంలో సైతం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయిస్తే తప్పకుండా గెలుస్తాడని సర్వేల్లో తేలింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ త్రిముఖ పోటీలో ఎవరు గెలుస్తారో ఓ దశలో అంతు చిక్కని పరిస్థితి కనబడింది. తీరా ఎన్నికల ఫలితాలు వెలువడడంతో కాంగ్రెస్‌కు కనీసం డిపాజిట్ కూడా దక్కకపోవడం శోచనీయం. చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కేవలం 25,235 ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ కు కావాల్సిన 28,894 ఓట్లకు 3,500 పై చిలుకు ఓట్లు దూరంగా ఉండడం ఆశ్చర్యం కలిగించింది. దుబ్బాకలో ఓటమిపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కనీస వేతనం అమలు చేయాలి

- మెద్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి
- అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

సంగారెడ్డి: గృహ కార్మికులకు న్యాయం చేయాలని మెద్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మెద్వన్ కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. అలాగే, మెద్వన్ స్వచ్ఛంద సంస్థ ఆధర్యంలో మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ వారి సహకారంతో గృహ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లాయర్ విఠల్ రెడ్డి, మెద్వన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడారు. మానవ హక్కులని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటు సమాజం పైన ఉందన్నారు. ప్రైవేట్ సంస్థల్లో, గృహాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశ్, స్వప్న, సమీర్, గృహ కార్మికులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యాదవరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ప్రారంభించారు. పథకం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆర్ఎంవో డాక్టర్ రాము, వైద్యులు రాజేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.


చరిత్రకు చెదలు

- శిథిలావస్థలో గడీ కోటలు
- కనుమరుగవుతున్న గత అనవాళ్లు
- మెదక్ జిల్లా వ్యాప్తంగా 250కి పైగానే..
- పట్టించుకోని అధికారులు

రామాయంపేట(మెదక్): చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడీ కోటలు శిథిలమవుతున్నాయి. వీటి మరమ్మతు విషయమై ప్రభుత్వాలు ఎంతమాత్రం పట్టించుకోకపోవడంతో గత వైభవం చాటిచెప్పిన గడీ కోటలు రానురాను కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. జిల్లా పరిధిలోని 469 పంచాయతీల్లో సుమారుగా 268 వరకు గడికోటలు ఉండగా, 250కి పైగా పాక్షికంగా శిథిలమైనట్లు గతేడాదాది పురావస్తుశాఖ అధికారుల సర్వేలో తేలింది. వీటిలో చాలా వరకు వందేళ్లక్రితం నిర్మించినవే. అప్పటి పాలకులు తమ శత్రువుల రాకను దూరం నుంచే తెలుసుకొని వారిని ఎదుర్కోవడానికి వీలుగా గ్రామానికి ఎత్తయిన ప్రదేశంలో ఈ కోటలు నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. శత్రువులు నేరుగా గ్రామాల్లోకి రాకుండా నిలువరించడానికి ఈ గడులను ఉపయోగించేవారని తెలిసింది. కానీ, ప్రస్తుతం వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాల్లో ఉన్న కోటలు రోజురోజుకూ శిథిలమై కూలిపోతున్నాయి. గ్రామాల్లో ఒక్కో గడీది ఒక్కో చరిత్రగా చెబుతుంటారు. అలాంటివి నేడు కరుమరుగయ్యే పరిస్థితిలో ఉండడం ఆందోళన కలిగిస్తుంది.

గడీ నిర్మించిన తర్వాతే తండా ఏర్పాటు

అటవీ ప్రాంతంలో ఉన్న మండలంలోని సదాశివనగర్ తండాలో సుమారు 150 ఏళ్ల క్రితం ఓ గడీ నిర్మించారు. దాని తర్వాతే అక్కడ తండా వెలిసినట్లు వృద్ధులు చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో నిర్మించిన ఈ గడీ వద్దకు అప్పటి రాజులు వేట కోసం వచ్చినప్పుడు విడిది చేసే వారని గిరిజనులు తెలిపారు. నేడు ఈ గడికోట పూర్తిగా శిథిలమైంది. ఝాన్సీలింగాపూర్ గ్రామంలో గడీకి పెద్ద చరిత్రే ఉంది. అప్పటి పాలకులకు సంబంధించి వంశంలో కొందరు ఇప్పటికీ గ్రామానికి వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ గడీ, స్థలాన్ని పంచాతీవారు పర్యవేక్షిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గతంలో నిర్మించిన గడీలు రహదారికి అడ్డుగా ఉన్నాయి. పాక్షికంగా శిథిలమైన కూలిపోతున్నాయి. నిజాంపేట, కాట్రియాల గ్రామాల్లో రోడ్డును ఆనుకొని ఉన్న గడీలు ప్రమాదకరంగా మారాయి.



సదాశివనగర్‌తండాలో పూర్తిగా శిథిలమైన గడీ

ఒక్కో గడీది ఒక్కో చరిత్ర



నేడు జిల్లా వ్యాప్తంగా ఉన్న గడీలు చాలా వరకు శిథిలమై కూలే పరిస్థితికి చేరుకున్నాయి. గత వైభవాన్ని, చరిత్రను చాటి చెబుతున్న గడీలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాల్సిన అవసరం ఉంది. గత చరిత్ర అందరికీ తెలియాలంటే వీటిని మరమ్మతు చేయించి, గ్రామాల వారీగా గడీల వివరాలు సేకరించాలి.

– కిషన్, కోనాపూర్

రాజుల విడిది



సదాశివనగర్‌లో పూర్తిగా శిథిలమైన గడీకి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ తండా ఏర్పాటు కాకముందే గడీ ఉన్నట్లు అప్పటి పెద్దలు చెప్పారు. అప్పటి రాజులు వేటకు వెళ్లి రాత్రివేళ ఈ గడీలో విశ్రమించేవారట. తద్వారా ఇక్కడ తండా ఆవిర్భవించింది.

– రాంసింగ్, సదాశివనగర్ తండా, రామాయంపేట

నాచగిరికి పోటెత్తిన జనం



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): ఓ వైపు కార్తీక వ్రతాలు, మరోవైపు నిజాభిషేకాలు, కల్యాణాలతో ప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. కార్తీకమాసం చివరి ఆదివారం సెలవురోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, ఇరుగు పొరుగు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. వ్రతమండపం, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోగా, ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు ఉదయమే క్షేత్రం చేరుకొని హరిద్రలో పుణ్యస్నానాల అనంతరం గర్భగుడిలో శ్రీవారి దర్శనం చేసుకున్నారు. మరోవైపు దంపతులు భక్తి శ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం చేసుకున్నారు. క్షేత్రంలో 200 సత్యదేవుని వ్రతాలు, 20 సేవలు, 9 నిజాభిషేకాలు, 13 కల్యాణాలు జరిగాయి. మరోవైపు సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సుధాకర్‌గౌడ్, నరేందర్, పాండు తదితర సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.



నాచగిరిలో కొలువుదీరిన స్వామివారు

ఉచిత బస్సు ప్రయాణం గొప్ప పరిణామం

ప్రగతి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాంచంద్రారెడ్డి



స్వీట్లు పంచుతున్న రాంచంద్రారెడ్డి

దుబ్బాకటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి స్త్రీల ఆకాంక్షలను నెరవేర్చడం గొప్ప పరిణామం అని తెలంగాణ ప్రగతి వేదిక రాష్ట్ర కన్వీనర్ అమ్మన రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ప్రగతి వేదిక ఆధ్వర్యంలో దుబ్బాక బస్టాండ్ వద్ద మహిళలకు స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం చాలా మంచి నిర్ణయమన్నారు. మహిళలు ఆర్థికంగా మరింత పురోగతి, చైతన్యం సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,300 బస్‌లలో మహిళలు ఉచిత ప్రయాణం చేయొచ్చన్నారు. ఏడాదికి రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతున్నా మహిళా సాధికారితను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సే లేదు..

- ఆర్టీసీ బస్సుల కోసం పల్లెలు ఎదురుచూపు
- అక్కన్నపేట మండలంలో దయనీయ పరిస్థితి
- పక్కా రోడ్లు ఉన్నా వృథానే..



పంతుల్‌తండా గ్రామానికి వెళ్లే రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): పల్లెల శాపమో...అధికారుల కోపమో.. కానీ నేటికీ అనేక గ్రామాలు పల్లె వెలుగు బస్సులను ఎరుగవు. గ్రామాల్లో ఉండే ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం సమీప పట్టణాలు, మండల, నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లాలంటే ఎక్కువగా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారు. కానీ, బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

అక్కన్నపేట మండలంలో 32 గ్రామాలు ఉంటాయి. అందులో కేశవాపూర్, మంచినీళ్ల బండ, దుబ్బ తండా, గుబ్బడి, కపూర్ నాయక్, పంతుల్ తండా, జనగామ, కేశనాయక్ తండా, మైసమ్మవాగు తండాకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామాల్లో పక్కా రోడ్లు ఉన్నా బస్సులు మాత్రం వెళ్లడం లేకపోవడం గమనార్హం. కేశవాపూర్ నుంచి మంచినీళ్ల బండ వైపుగా టేకుల తండా మీదుగా కొత్తకుండ వరకు పక్కా రోడ్డు ఉంది. అలాగే అక్కన్నపేట మండల కేంద్రం నుంచి నేరుగా పంతుల్‌తండా వరకు రోడ్డు సౌకర్యం ఉంది. కపూర్ నాయక్ తండా, కేశనాయక్ తండా గ్రామాలకు రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. దీంతో మండల కేంద్రానికి, పక్క గ్రామాలకు అవసరాల నిమిత్తం ప్రజలు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాల పరిస్థితిని ప్రజాప్రతినిధులు, నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా మాకు ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఈ గ్రామాల వైపు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రవాణశాఖ మంత్రిగా పొన్నం పదవి బాధ్యతలు చేపట్టడంతో ఈ గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం వస్తుందని జోరుగా చర్చించుకుంటున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని చక్రపురి కాలనీలో రఘువర్మకు చెందిన ఖాళీ స్థలంలో ఓ గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని శనివారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. భార్య ఇంటికి రావడం లేదని మనోహరాబాద్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకోగా, కుటుంబ కలహాలతో చిన్న శంకరంపేటలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తితో నిజాంపేటలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు.

భార్య రావడం లేదని..



దుశ్యంత్ కుమార్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): భార్యపై మనస్తాపంతో భర్త ఉరి వేసుకొని ఆత్యహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రం జార్సుగుండా జిల్లాకు చెందిన దుశ్మంత కుమార్ జెన (42) మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ గ్రామంలో అద్దెకుంటున్నాడు. ముప్పిరెడ్డిపల్లి శివారులో గల మీఎస్టీ పరిశ్రమలో రెండేళ్లుగా కార్మికుడిగా పని చేస్తూ భార్యాపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం భార్య పిల్లలతో కలిసి సొంత గ్రామానికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు

చిన్నశంకరంపేట(మెదక్): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చిన్నశంకరంపేట మండలం మీర్జా పల్లి–వడియారం రైల్వేస్టేషన్ మధ్యలోని కామారం శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కొమ్ము జీవన్ అలియాస్ రాజు (28) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో కామారం శివారులో ఎదురుగా వస్తున్న రైలును ఢీకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపారు.



జీవన్ (ఫైల్)

జీవితంపై విరక్తితో..

నిజాంపేట(మెదక్): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని బచ్చురాజు పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింలు(45) మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.